సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 31 । జనవరి । 2025



ఉత్సవాలకు విచ్చేసే వారి కోసం సిద్ధం చేసిన కుర్చీలు

## న్యూస్‌రీల్

### కాఫీ రైతులకు రూ.50 లక్షల బోనస్

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

**పాడేరు :** చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌కు కాఫీ పండ్లు సరఫరా చేసిన గిరిజన కాఫీ రైతులకు రూ.50లక్షల బోనస్ చెల్లిస్తున్నామని పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో మాక్స్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, డైరెక్టర్లతో పాటు ఐటీడీఏ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రైతులకు కిలోకు రూ.44 చెల్లించామన్నారు. ఇప్పుడు అదనంగా కిలోకు మరో రూ.8 బోనస్‌గా చెల్లిస్తామన్నారు. గత ఏడాది చెల్లించిన బోనస్ కంటే రెట్టింపు బోనస్‌ను రైతులకు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 621 మెట్రిక్ టన్నుల పార్చ్‌మెంట్ కాఫీని ఐటీసీ సంస్థకు విక్రయించినట్టు పీవో తెలిపారు. ప్రతి రైతుకు పారదర్శకంగా బోనస్ చెల్లిస్తామన్నారు.ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, మాక్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏకలవ్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వై.రామవరం:** మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ భూరా రామభైరవ తెలిపారు. దరఖాస్తులు ఈనెల వ,చ్చేనెల 19వ తేదీలోగా చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను టీడబ్ల్యూఏఆర్‌ఈఐఎస్‌సీఈటీ.ఏపీసీ ఎఫ్ఎస్ఎస్.ఇన్, ఏపీటీడబ్ల్యూఏగురుకులమ్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9571424956, 6304101706 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి

- నేడు నిర్వహించాల్సిన జాబ్‌మేళా రద్దు

**రంపచోడవరం:** ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించాల్సిన జాబ్‌మేళాను రద్దు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డా. పి రోహిణి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రద్దు చేయడం జరిగిందన్నారు.

### అయ్యన్నపాత్రుడిపై అట్రాసిటీ కేసు పెట్టాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

**విశాఖ విద్య :** గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుపై అట్రాసిటీ కేసు పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ డాక్టర్ తెడబారిక సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్ర యూనివర్సిటీలో గిరిజన నాయకులతో కలిసి నిరసన తెలిపారు. గిరిజనుల హక్కులు, చట్టాలకు వ్యతిరేకంగా ఆదివాసులను అవమానపరిచేలా, మనోభావాలకు భంగం కలిగించేలా అయ్యన్నపాత్రుడు మాట్లాడారన్నారు. స్పీకర్ హోదాలో గిరిజనులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తక్షణమే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాలు జోలికొస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఆదివాసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### రంపచోడవరంలో జాబ్‌మేళా రేపు

- డీఎస్పీ సాయి ప్రశాంత్



**రంపచోడవరం:** ఏజెన్సీలో నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో వచ్చేనెల 1న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని రంపచోడవరం డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపారు. ఇన్నోవ్ సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిరుద్యోగ యువతకు టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఇందు కోసం రంపచోడవరంలో కంపెనీ తరఫున ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులకు భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

---

ప్రకృతి అందాలకు నిలయమైన ఆంధ్రా ఊటీ అరకులోయ చలి ఉత్సవాలకు సిద్ధమైంది. నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో గిరిజన వంటకాలు, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

- చలి ఉత్సాహం

# ముస్తాబైన వన మయూరం

అరకు చలి ఉత్సవము 2025 ARAKU FESTIVAL






ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన జెయింట్ వీల్

**సాక్షి, పాడేరు/అరకులోయ టౌన్:** ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయకు పూర్వం నుంచి ఆంధ్రా ఊటీగా పేరుంది. ఈ ప్రాంత అందాలకు దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు ఫిదా అవుతుంటారు. ఇలా ప్రత్యేకతలు ఉన్న అందాల అరకులోయ చలి ఉత్సవాలకు ముస్తాబయ్యింది. శుక్రవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు మూడు రోజులపాటు అరకు చలి ఉత్సవాలకు పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఉత్సవ ఏర్పాట్లను గురువారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఏఎస్పీ ధీరజ్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. తురాయిగుడ కొండ సమీపంలోని హెలీ రైడ్‌లో కలెక్టర్‌తోపాటు అధికారులు పాల్గొని విహరించి, అరకు అందాలను తిలకించారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు.

హెలీరైడ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఉత్సవం నిర్వహించే డిగ్రీ కళాశాల మైదానం, పద్మాపురం ఉద్యానవనం, హెలీ రైడ్ ప్రాంతంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఫైర్ ఇంజన్, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామన్నారు.

**150 మంది బుకింగ్**

హెలీరైడ్ కోసం ఆన్‌లైన్‌లో 150 మంది బుక్ చేసుకున్నారని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో హెలీ రైడ్‌కు రూ. 3,500, స్పాట్ బుకింగ్ రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెలీరైడ్‌లో విహరిస్తే అరకు అందాలు అద్భుతంగా కనిపించాయన్నారు. గిరిజన వంటకాలు, అరకు కాఫీ పర్యాటకులకు రుచి చూపించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకదృష్టి**

చలి ఉత్సవాలకు భారీగా సందర్శకులు తరలివస్తారని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టారు. స్టాళ్లు, మారథాన్ ర్యాలీ, వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఇప్పటికే ఆదేశించారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు మెరుగైన పారిశుధ్యంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఉత్సవాల్లో ముందుగా నిర్వహించే అరకు మారథాన్‌లో భారీగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఉత్సవ ఏర్పాట్లను జిల్లా అధికారులతోపాటు టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, డేవిడ్‌రాజు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, మ్యూజియం క్యూరేటర్ మురళి, డీపీఆర్వో గోవిందరాజులు, తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్, ఎంపీడీవో అడపా లవరాజు పర్యవేక్షించారు.

**మైమరిచిపోయేలా హెలీరైడ్**

ఉత్సవాల్లో భాగంగా హెలీ రైడ్‌లో పాల్గొనే సందర్శకులకు ప్రకృతి అందాలు మైమరిచి పోయేలా చేయనున్నాయి. అరకులోయ పరిసరాలు, పద్మాపురం ఉద్యానవనం, ఎత్తయిన కొండలు, లోయలను తిలకించేలా హెలీరైడ్‌ను రూపొందించారు.

**నోరూరించనున్న గిరిజన వంటకాలు**

ఉత్సవాలు మూడు రోజులపాటు గిరిజన వంటకాలు నోరూరించనున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరి ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శిస్తారు. వీటిలో రాగి పిండితో తయారు చేసిన అంబలి (రాగి జావ), తోప (రాగి సంగటి), సామ, కొర్ర బియ్యంతో అన్నం, రాజ్‌మా, కందులు, బొబ్బర్లు (అలసందలు, తదితర గిరిజన వ్యవసాయ ఉత్పత్తులతో తయారు చేసిన వంటకాలు ప్రదర్శనలో ఉంచుతారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా పుష్పాలంకరణ**

పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేస్తున్న ఫ్లవర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందుకు ప్రత్యేకంగా పుష్పాలను రప్పించారు. ప్రదర్శనలో భాగంగా పద్మాపురం ఉద్యానవనంలో బొకేలతో పాటు ఫ్లవర్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. అతిథులకు స్వాగతం పలికేందుకు కూడా ప్రత్యేకంగా పుష్పాలతో బొకేలను సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు



కళాశాలలో సిద్ధం చేసిన ఉత్సవ వేదిక



రైడ్‌కు సిద్ధంగా హెలికాప్టర్



స్టాల్స్ కోసం ఏర్పాటు చేసిన వేదిక



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

### ప్రత్యేకతలివే..

అరకు మారథాన్, పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో, గిరిజన వంటకాల ఫుడ్ కోర్టు, పలు రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కాఫీ రుచులు, ఫ్యాషన్ షో, సినీ కళాకారులతో కామిడీ స్కిట్స్, సుంకరమెట్ట కాఫీ తోటల్లో అరకు ట్రెక్, హెలీకాప్టర్ రైడింగ్



హెలీ రైడ్‌కు బయలుదేరుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా అధికారులు

### ఉత్సవాల డైరీ

**31వ తేదీ:** ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు పద్మాపురం గార్డెన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన వేదిక వరకు ఐదు కిలోమీటర్ల మేరకు అరకు మారథాన్

- 11గంటలకు పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో ప్రారంభం
- మధ్యాహ్నం ఒంటి గంటకు 25 స్టాళ్లలో గిరిజన వంటకాల ఫుడ్ కోర్టు ప్రారంభం
- 3గంటలకుపద్మాపురం గార్డెన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదిక వరకు కార్నివల్ పరేడ్
- సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు. పలు రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్యాలతోపాటు డప్పు వాయిద్యాలు ప్రదర్శన

**ఫిబ్రవరి 1వ తేదీ:** బొర్రాగుహల నుంచి అరకు డిగ్రీ కళాశాల వేదిక వరకు ఉదయం 7గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు సైక్లింగ్

- 11గంటలకు అరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్లాంటేషన్ డ్రైవ్
- మధ్యాహ్నం 12 గంటలకు డిగ్రీ కళాశాల ప్రధాన వేదిక వద్ద
- 2గంటలకు అరకులోయ కాఫీ హౌస్‌లో కాఫీ రుచుల టేస్టింగ్
- 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎక్స్‌పర్ట్స్‌తో ముఖాముఖీ
- సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, అరకు ఫ్యాషన్‌షో, గిరిజన నృత్యాలు, మార్షల్ ఆర్ట్స్, ఫుట్‌స్టెప్స్, సినీ కళాకారులతో కామెడీ స్కిట్స్,

**ఫిబ్రవరి 2వ తేదీ:** ఉదయం 7గంటలకు సుంకరమెట్ట కాఫీ తోటల్లో అరకు ట్రెక్

- ఉదయం 10 గంటలకు అరకులోయ పట్టణంలో రంగోళి పోటీలు
- మధ్యాహ్నం 12 గంటల నుంచి అరకులోయ గిరిజన మ్యూజియంలో ఫ్లాస్ మోబో సాంస్కృతిక కార్యక్రమాలు
- సాయంత్రం 6గంటల నుంచి ఉత్సవ ముగింపు వేడుకలు, ముఖ్య అతిథుల ప్రసంగాలు

---

## స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలి
- లేకుంటే ఉత్సవాలను అడ్డుకుంటాం
- పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు



**పాడేరు :** గిరిజనులకు జీవనాడిగా ఉన్న 1/70 చట్టాన్ని తుంగలోకి తొక్కేలా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలకు నిరసనగా చలి ఉత్సవాలను తమ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. దీనిపై గురువారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి చర్చించారు. గిరిజన ప్రాంతంలో ప్రజలు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతుంటే వాటిని పరిష్కారించాల్సిందిపోయి ఏం సాధించారని అరకు చలి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు చేయకుండా ఎవరి కోసం అరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. టూరిజం, గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడంతో గిరిజనులంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. గిరిజనుల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో అరకు ఉత్సవాలు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. రూ.కోట్ల రూపాయలు ప్రజాధనం వృథా చేసేందుకు అరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. 1/70 చట్టానికి తూట్లు పొడిచేలా మాట్లాడిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజన సమాజానికి క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడిన అయ్యన్న పాత్రుడితో సహ కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలకు గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. ఎన్ని నిర్బంధాలు పెట్టినా తాము ఉత్సవాలను అడ్డుకొని తీరుతామని పాడేరు ఎమ్మెల్యే స్పష్టంచేశారు.

## అరచేతిలో స్వర్గం.. ఆచరణలో విఫలం

- సూపర్ సిక్స్ హామీలు గాలికి
- సంపద సృష్టి ప్రచారానికే పరిమితం
- 1/70 చట్టంపై స్పీకర్ వ్యాఖ్యలు సరికాదు
- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజం



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

**అరకులోయ టౌన్:** ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చి అరచేతిలో స్వర్గం చూపించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చడంలో విఫలమయ్యారని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లో రూ. 1.19 లక్షల కోట్ల మేర చంద్రబాబు ప్రభుత్వం అప్పులు చేసిందన్నారు. కనీసం ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వకుండా ఉన్న ఉద్యోగాలను చంద్రబాబు పీకేశారన్నారు. గత ప్రభుత్వంలో ముందుచూపుతో సముద్ర తీర ఆధారిత ఆర్థిక వ్యవస్థలకు జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ రూపొందించారన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో మూడు చోట్ల పోర్టులు, హార్బర్ల నిర్మాణానికి నిర్మిణానికి శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చంద్రబాబు తమ వారికి కట్ట బెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య రంగంలో విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టి 17 వైద్య కళాశాలలు మంజూరు చేసి, నిర్మాణాలు చేపట్టారని, అందులో పూర్తిస్థాయిలో సీట్ల భర్తీకి చంద్రబాబు అడ్డుకట్ట వేశారన్నారు. చంద్రబాబు పాలనలో ఇసుక, మట్టి, ఫ్లైయాష్, మద్యం మాఫీయాలు రెచ్చిపోయి జేబులు నింపు కుంటున్నారన్నారు. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు మాటలు వట్టి మాటలేనన్నారు. నీతి అయోగ్ పేరిట చంద్రబాబు విడుదల చేసిన రిపోర్ట్ ఆశ్చర్యంగా ఉందన్నారు. 2014లో చంద్రబాబు పాలనలో మూలధనం వ్యయం కింద రూ. 13.800 కోట్లు ఖర్చు పెడితే జగనన్న పాలనలో సగటున ఏడాదికి రూ. 15.632 కోట్లు ఖర్చు చేశారన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం అడ్డంకిగా ఉందని, దీని సవరించాలని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. వెంటనే వీటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. జెడ్పీటీసీ శెట్టి రోషిణి, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, సర్పంచ్‌లు బీటీ బొజ్జ, మాదల బుడిటి, పెట్టెలి సుస్మిత, సమిడ వెంకట పూర్ణిమ, ఎంపీటీసీలు దురియా ఆనంద్ కుమార్, శత్రుఘ్న, ఎం.లలిత, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్‌కుమార్, మేధావుల విభాగం అధ్యక్షుడు రాజరమేష్, గ్రీవెన్స్ విభాగం అరకు అధ్యక్షుడు కొండబాబు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సద్వినియోగం



మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా



జాబ్‌మేళాకు హాజరైన యువతీ యువకులు

- చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా
- జాబ్‌మేళాకు విశేష స్పందన
- 415 మంది నిరుద్యోగ యువత హాజరు

**చింతపల్లి:** ప్రేరణ కార్యక్రమంలో గిరిజన యువతకు అందిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా కోరారు. గురువారం ప్రేరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ కాంప్లెక్స్ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు సర్కిల్‌లోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 415 మంది గిరిజన యువతీ యువకులు హాజరయ్యారు. ఇన్నోవ్‌సోర్సు ప్రతినిధులు ఉన్నికృష్ణ, ప్రశాంత్‌కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ ఓసీ వినీత ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ గిరిజన యువత పెడదారి పట్టకుండా పోలీసు, ప్రభుత్వ శాఖలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంజాయి,మద్యం, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పూర్తి భద్రతతో కూడిన వేతనం, ఉచిత భోజన వసతి సదుపాయాలను కల్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, కొయ్యూరు సీఐలు వినోద్‌బాబు, వెంకటరమణ, ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాజెక్టు లక్ష్య 2.0 పేరిట ఉచిత సివిల్స్ కోచింగ్

ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి

**పాడేరు :** విద్యావంతులైన నిరుద్యోగ గిరిజన యువతకు ప్రాజెక్టు 2.0 పేరిట ఉచితంగా సివిల్స్ కోచింగ్ నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో ఉచిత కోచింగ్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. గత రెండేళ్లుగా ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ అందజేశామన్నారు. త్వరలో ప్రారంభం కాబోయే ఉచిత సివిల్స్ శిక్షణకు ఫిబ్రవరి ఐదు నుంచి తమ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గతంలో మాదిరిగానే ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులకు సివిల్స్ రాత పరీక్ష, ఉచిత కోచింగ్‌కు ఎంపిక చేస్తామన్నారు. సివిల్స్‌తో పాటు గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సిద్ధం చేస్తామన్నారు. నిరుద్యోగ గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## గిరి రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యం



సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

**రంపచోడవరం:** ఏజెన్సీలో గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఐటీడీఏ సమావేశపు మందిరంలో గురువారం వ్యవసాయ అనుబంధ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి నాటికి వ్యవసాయానికి సంబంధించిన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఏజెన్సీలో పశువులకు టీకాలు కార్యక్రమం ఫిబ్రవరి 5 నాటికి నూరుశాతం పూర్తి చేసి, పశు సర్వే నిర్వహించి తమకు నివేదించాలన్నారు. మేకలు, గొర్రెలు, గేదెలు పెంచుకునేందుకు బ్యాంకులు ద్వారా రుణాలు పొందేందుకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేయించాలని సూచించారు. ఏజెన్సీలో చేపల చెరువులపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. చేపల పిల్లలు ఉచితంగా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చెరువులు, కాలువల పూడిక తీతకు ప్రతిపాదించాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించి కొత్త పనులు మంజూరుకు నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ ఏడాది వీడీవీకేల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి, రంపచోడవరం, అడ్డతీగలల్లో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ డీడీ షరీఫ్, ఏడీ సీహెచ్ కేవీ చౌదరి, కె సావిత్రి, పీహెచ్‌వో కె చిట్టిబాబు, పీఏవో ఎల్.రాంబాబు, ఏవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉక్కు, పెట్రో కెమికల్ రంగాలపై సమీక్ష



నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

విశాఖ సిటీ: నీతి ఆయోగ్ ప్రధాన ప్రగతి చోదకాలైన ఉక్కు, పెట్రో కెమికల్ రంగాలపై గురువారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సమీక్ష జరిగింది. నీతి ఆయోగ్ సభ్యుడు కె.కిశోర్, మెట్రోపాలిటన్ కమిషనర్, నీతి ఆయోగ్ నోడల్ అధికారి కె.ఎస్.విశ్వనాథన్, ఇన్స్టిట్యూట్ ఫర్ సస్టైనబిలిటీ ఎంప్లాయిమెంట్ అండ్ గ్రోత్(ఐఎస్ఈజీ) తరఫున శిరీష్ కాంబే సమావేశంలో పాల్గొని ఆయా రంగాలపై చర్చించారు.

### ఎముకల ఆరోగ్యంపై అవగాహన అవసరం




సదస్సులో పాల్గొన్న నిపుణులు, వైద్యులు

మహారాణిపేట: నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల, కేజీహెచ్ ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్ర స్థాయి సదస్సు (ఒసాప్కిన-2025) గురువారం ప్రారంభమైంది. తొలిరోజు గురువారం కేజీహెచ్ అనాటమీ విభాగం ఆధ్వర్యంలో కెడావరిక్ పెల్విస్ ఎసిటిబిలర్ సర్జరీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్థో వైద్య నిపుణులు, పీజీ వైద్య విద్యార్థులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. సదస్సును ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, పలువురు వైద్యులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ ఎముకల విభాగానికి సంబంధించి నూతనంగా అందుబాటులోకి వస్తున్న వైద్యవిధానాలు, విప్లవాత్మకమైన మార్పులు, తదితర అంశాలపై పీజీ విద్యార్థులు, వైద్యులకు ఎంతో అవగాహన అవసరమన్నారు. ఎముకల ఆరోగ్యంపై అవగాహన అవసరం అన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా విశాఖలో కేజీహెచ్ అనాటమీ విభాగం ఆధ్వర్యంలో కెడావరిక్ వర్క్‌షాపు నిర్వహించి విద్యార్థులకు ఎముకలు విరిగితే ఏ విధంగా వైద్యం అందించాలి అనే అంశంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ సర్జరీ నిర్వహణకు అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర కిశోర్ పూర్తిస్థాయి సహకారం అందించారన్నారు. వర్క్ షాపులో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్.ఎస్.లోకనాథ్, డాక్టర్ వర్మ, ప్రముఖ ఆర్థో వైద్యులు డాక్టర్ వి.వి.కె.తిర్కా, డాక్టర్ రమేష్‌సేన్, డాక్టర్ విజయ్, డాక్టర్ అశోక్, డాక్టర్ ప్రదీప్‌తోపాటు డాక్టర్ లీలా ప్రసాద్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జిగా డాక్టర్ భవానిప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ ఎం.చంద్రశేఖర్ నాయుడు, కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

# 3 నుంచి నామినేషన్ల స్వీకరణ

- 27న పోలింగ్, మార్చి 3న లెక్కింపు
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్, ఆర్వో హరేంధిరప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, చిత్రంలో డీసీపీ అజిత

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుందని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని విశాఖ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కలెక్టరేట్‌లో గురువారం డీసీపీ అజిత, జిల్లా రెవెన్యూ అధికారి, సహాయక రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీ శంకర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉత్తరాంధ్ర పరిధిలోని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆర్వోలుగా, డీఆర్వోలు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

**3 నుంచి నామినేషన్ల స్వీకరణ**

షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ రోజు నుంచి అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు కలెక్టర్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారని ఆర్వో హరేంధిరప్రసాద్ తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 3 గంటలతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని, 11న పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని కలెక్టర్ వివరించారు. జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలని, ఫారం-26 ద్వారా అఫిడవిట్ సమర్పించాలన్నారు. అనుమతుల జారీకి సంబంధించి కలెక్టరేట్‌లో సింగిల్ విండో డెస్క్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా అన్ని రకాల నిబంధనలు అభ్యర్థులకు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

**ఓటర్లు 21,555.. పోలింగ్ కేంద్రాలు 123**

2024 డిసెంబర్ 30న వెలువరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుష ఓటర్లు 12,948, మహిళా ఓటర్లు 8,607 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. విశాఖలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. డీసీపీ అజిత మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**పర్యవేక్షణకు 23 బృందాలు**

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, ఇందుకోసం వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 ఎంసీసీ బృందాలను నియమించామని కలెక్టర్ చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్, జెడ్పీ సీఈవో, భీమిలి, విశాఖ ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

## కొనసాగుతున్న ఖైదీల తరలింపు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం నుంచి 200 మంది ఖైదీలను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 28వ తేదీ నుంచి రోజుకు 20 మంది చొప్పున ఎస్కార్ట్ వ్యానులో తరలిస్తున్నారు. మూడోరోజు గురువారం కూడా 20 మందిని తరలించారు. ఇంతవరకు 60 మందిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు జైల్ అధికారులు తెలిపారు.

# గాంధీ మార్గం అనుసరణీయం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : అహింస మార్గం ద్వారా శాంతియుత పోరాటాలు చేసి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన ఘనత జాతిపిత మహాత్మా గాంధీజీకే దక్కుతుందని, ఆయన పోరాట పటిమను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గాంధీజీ అహింసా, తత్వ శాస్త్రం, సాముహిక సమీకరణ ద్వారా భారత జాతీయ ఉద్యమాన్ని నడిపించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. సత్యాగ్రహం, శాసనోల్లంఘన వంటి నిరసన పద్ధతుల ద్వారా కోట్లాది మంది భారతీయులను ఏకం చేశారన్నారు. ఆయన పోరాటాలు, త్యాగాలు ఎప్పటికి చిరస్మయణీయమన్నారు. గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు లకే రామకృష్ణపాత్రుడు, కుంతూరు నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు నాగరాజు, కన్నాపాత్రుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షురాలు రామసత్యవతి, నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీడర్ అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- ఈఎంటీ చొరవపై కుటుంబ సభ్యుల హర్షం



ఫీడర్ అంబులెన్స్‌లో గర్భిణి సుభద్రను తరలిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: 108 అంబులెన్స్ అందుబాటులో లేక ఫీడర్ అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం అయిన సంఘటన ఆలస్యంగా మండలంలో వెలుగు చూసింది.మండలంలోని పనసపుట్టు పంచాయతీ చిల్లిపుట్టు గ్రామానికి చెందిన కిరసాని సుభద్రకు బుధవారం సాయంత్రం పురిటినొప్పులు వచ్చాయి. దీంతో భర్త మోహన్‌దాసు 108 కు ఫోన్ చేశారు. ప్రస్తుతం 108 అంబులెన్స్ అందుబాటులో లేదని, రావడానికి గంట ఆలస్యం అవుతుందని చెప్పడంతో వెంటనే లబ్బూరు పీహెచ్‌సీ ఫీడర్ అంబులెన్స్‌కు సంప్రదించారు. దీంతో ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ మర్రి సుబ్బారావు హుటాహుటిన చిల్లిపుట్టు గ్రామానికి చేరుకొని గర్భిణిని లబ్బూరు పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా మార్గం మధ్యలో పోలీపుట్టు జంక్షన్ వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ సుబ్బారావు గర్భిణి తల్లి సహకారంతో ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డను ప్రసవించింది. అనంతరం లబ్బూరు పీహెచ్‌సీలో తల్లీ బిడ్డను చేర్పించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిసింది. ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ సుబ్బారావు చూపిన చొరవపై గర్భిణి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. 108 అంబులెన్స్ నిత్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పార్టీ మరింత బలోపేతానికి కృషి



సందడి కొండబాబును సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పార్టీ మహిళ విభాగ అధ్యక్షురాలిగా ఎన్నికైన సర్పంచ్ పూర్ణిమను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పెదబయలు: అరకు నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు, అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంనకు అభినందనలు తెలుపుతున్నట్టు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సందడి కొండబాబు చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తనను అరకు నియోజకవర్గం గ్రీవెన్స్ విభాగ అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు ఆయన అరకులోయలో ఉన్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను మర్యాదపూర్వకంగా కలిసి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ మరింత బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సందడి కొండబాబును ఎమ్మెల్యే మత్స్యలింగం శాలువా కప్పి సన్మానించారు. నాయకులు చంద్రబాబు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ అరుకు అసెంబ్లీ మహిళా విభాగ అధ్యక్షురాలుగా ఎన్నికవడంపై గురువారం అరుకులో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అభినందించి, ఆమెను ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతు పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికీ పార్టీ గుర్తిస్తుందన్నారు. అనంతరం సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతు తనకు పదవి రావడంపై ఎమ్మెల్యే మత్స్యలింగనకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మెన్ గోవింద్, నాయకులు సూరిబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసి.. చోరీ కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరావు

సీతమ్మధార: దారి కాసి ఒక వ్యక్తిపై దాడి చేసి.. జేబులో ఉన్న నగదును చోరీ చేసిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెంకటరావు తెలిపారు. ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ రాత్రి సుమారు 10.28 గంటలకు ఫిర్యాదుదారుడైన విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన ఎం.శ్రవణ్ కుమార్ తన పని ముగించుకుని డైమండ్ పార్క్ దగ్గర గణేష్ బార్ సమీప ప్రాంతానికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఆటోలో నలుగురు వ్యక్తులు వచ్చి శ్రవణ్‌పై దాడిచేసి, అతని జేబులో ఉన్న రూ.1000 నగదును దొంగిలించుకుపోయారు. దీంతో బాధితుడు ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ద్వారకా సబ్ డివిజన్ పోలీసు సీఐ పర్యవేక్షణలో ద్వారకా క్రైం ఎస్ఐ చక్రధర్, ఏఎస్ఐ కిశోర్, పీసీ రాజు, అప్పలరాజు, ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1000 నగదును, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో మారికవలసకు చెందిన లాగం అఖిల్ రామసాయి(18), తాటిచెట్లపాలేనికి చెందిన రొంగలి గణేష్(18), బోయపాలేనికి చెందిన పచ్చగొళ్ల కేదార్‌నాథ్(21), బాలుడు ఉన్నారు. సమావేశంలో ద్వారకా జోన్ క్రైం సీఐ చక్రధర్, క్రైం ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

## మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్

నర్సీపట్నం : పట్టణంలోని గుర్రాల రోడ్డులో అక్రమంగా మద్యం కలిగి ఉన్న మహిళను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. కోటవురట్ల మండలం, యండపల్లి గ్రామానికి చెందిన చిలకమ్మ నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గురువారమే రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నారాయణ రావు, లావణ్య పాల్గొన్నారు.

# గిరిజన చట్టాల జోలికొస్తే ఖబడ్దార్



గోరాపూర్ ఇసుక రీచ్ వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు



గూడెంకొత్తవీధిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చింతపల్లిలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నాయకులు



దబ్బగరువులో ధర్నా చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై ధ్వజం**

డుంబ్రిగుడ/పెదబయలు/(అనంతగిరి)అరకులోయటౌన్/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/గూడెంకొత్తవీధి/చింతపల్లి/కొయ్యూరు: గిరిజన చట్టాలపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, మన్యంలోని 1/70 చట్టం జోలికొస్తే సహించేది లేదని గిరిజన సంఘం, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అయ్యన్న వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి సన్నిబాబు, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు, గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయినకుమారి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ, గిరిజన సంఘం నాయకులు సూర్యనారాయణ, శ్రీను, చిన్నారావు, ధనుంజయ్ మాట్లాడారు. ఇటీవల విశాఖలోని జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో ఏజెన్సీలో 1/70 చట్టం సవరణ ద్వారానే ఏజెన్సీ ప్రాంతాల్లో పెట్టుబడిదారులు వస్తారని, భూ బదలాయింపు చట్టం సవరణ చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారన్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీన్ని ప్రతి గిరిజనుడు వ్యతిరేకించాలన్నారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై జిల్లా పరిషత్ సమావేశంలో గిరిజనుల తరఫున గళం విప్పి ప్రభుత్వ ఆగడాలను ఎండగడతానన్నారు.ఏజెన్సీలో సహజ వనరులు దోచుకుంటే ఊరు కొమని 1/70 చట్టం జోలికోస్తే కూట మి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని, అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోని, గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు కళ్యాణం శ్రీను, భాస్కరరావు, బుజ్జిబాబు, అరుణ్ వెంకట్, దొరబాబు, అశోక్‌లాల్, పాపారావు, సూరిబాబు, లోవరాజు, కృష్ణ, బాబూరావు పాల్గొన్నారు.



అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గంగరాజు

# వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్టు



కశింకోట పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్నప్పటి అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో భర్త సహా నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. కశింకోట పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. వెదురుపర్తి గ్రామానికి చెందిన పలివెల కృపాసాగర్(32)కు, పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన మిరియాల సుమ(29)కు 2019లో వివాహం జరిగిందన్నారు. ఆ సమయంలో వధువు కుటుంబీకులు రూ.లక్ష కట్నం, మరో రూ.లక్ష ఇతర లాంఛనాలకు, రూ.30 వేలు ఆడపడుచు లాంఛనాలుగా ఇచ్చారన్నారు. కొంత కాలం పాటు వారి కాపురం సజావుగానే సాగిందన్నారు. ఇద్దరు ఆడ పిల్లలు కలిగారన్నారు. తర్వాత కొన్నాళ్లకు అత్త పార్వతి(48), మామ అప్పారావు(50), ఆడపడుచు మేరీ(30) కలిపి సుమను అదనపు కట్నం తెమ్మని వేధించారని, దీంతో దఫదఫాలుగా నగదు ఇచ్చారన్నారు. చివరగా ఇటీవల అదనపు కట్నం తెమ్మనగా రూ.10 వేలు అప్పు చేసి ఇచ్చినట్టు తల్లి మిరియాల వెంకయ్యమ్మ పేర్కొన్నారన్నారు. అయినా ఇంకా డబ్బు కోసం వేధింపులు ఎక్కువవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ మేరకు తల్లి వెంకయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి భర్త, అత్తమామ, ఆడపడుచులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

# గంజాయితో ఇద్దరు యువకుల అరెస్ట్



ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు

కె.కోటపాడు : ఒడిశా రాష్ట్రం పాడువా మండలం నుంచి గంజాయిని తీసుకువస్తూ ఇద్దరు యువకులు కె.కోటపాడు పోలీసులకు గురువారం పట్టుబడ్డారు. కె.కోటపాడు గ్రామ శివారు చల్లా వారి కళ్లాల వద్ద పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా కె.కోటపాడు మీదుగా విశాఖపట్నానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న పి.బాల దుర్గా గణేష్, కె.సూర్యను ఆపి వాహనం తనిఖీ చేయగా బ్యాగ్‌లో కిలోన్నర గంజాయిని గుర్తించారు. వారు నాలుగు రోజుల క్రితం ఒడిశా ప్రాంతానికి వెళ్లి గంజాయిని తీసుకువస్తున్నట్టు విచారణలో తేలింది. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.7500 ఉంటుందని పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనంతో పాటు ఒక సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్టు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# నేవీ ఉద్యోగి అనుమానాస్పద మృతి



మృతి చెందిన సిరిముళ్ల సంతోష్

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డులో నేవీ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలివీ.. మల్కాపురం శ్రీహరిపురానికి చెందిన సిరిముళ్ల సంతోష్ (25) తన తండ్రి సూరిబాబు, తల్లి అచ్చియమ్మ, సోదరి దివ్యతో కలిసి నివసించేవాడు. సంతోష్ 2021లో డిప్లమో పూర్తి చేసిన తర్వాత ఉప్పాడ సమీపంలోని ఐఎన్ఎస్ కళింగలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)గా ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి వాల్తేర్‌లోని తన పిన్ని ఇంటి వద్ద నుంచి ప్రతి రోజూ విధులకు హాజరవుతున్నాడు. వాల్తేర్ నుంచి కూడా దూరం కావడంతో.. నాలుగు నెలల కిందట కాపులుప్పాడ జగనన్న కాలనీలో తన స్నేహితుడు యశ్వంత్ సాయి, అతని సోదరితో కలిసి ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కాగా.. సంతోష్ విధులు ముగించుకుని బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన యశ్వంత్ సాయి ఉరి వేసుకున్న సంతోష్‌ను చూశాడు. వెంటనే అతను సంతోష్ ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. తన కుమారుడికి ఎటువంటి చెడు వ్యసనాలు లేవని, వచ్చే ఏడాది పెళ్లి కూడా చేసుకునేందుకు సిద్ధమయ్యాడని అతని తల్లిదండ్రులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు కూడా లేవని, అలాంటిది తమ కుమారుడు ఉరి వేసుకుని చనిపోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సంతోష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. యశ్వంత్ సాయికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్-కటక్ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా నడుస్తున్న హైదరాబాద్-కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ప్రతీ మంగళవారం రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు బుధవారం ఉదయం 9.05 గంటలకు దువ్వాడకు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు మార్చి 25వ తేదీ వరకు పొడిగించబడింది.

తిరుగు ప్రయాణంలో కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ప్రతీ బుధవారం రాత్రి 10.30గంటలకు బయల్దేరి మరుసటిరోజు గురువారం ఉదయం 7.35 గంటలకు, అదేరోజు రాత్రి 9గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు మార్చి 26వ తేదీ వరకు పొడిగించబడింది.